కాకినాడ సాగరతీరంలో...

టైగర్ ట్రంప్ విన్యాసాలు ప్రారంభం



విన్యాసాల్లో పాల్గొన్న ఇండో-అమెరికన్ సైనికులు

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఇండియా-అమెరికా త్రివిధ దళాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైగర్ ట్రంప్ విన్యాసాలు మంగళవారం కాకినాడ సాగరతీరంలో లాంఛనంగా ప్రారంభమయ్యాయి. సూర్యారావుపేట నేవెల్ ఎన్‌క్లేవ్‌లో భారత తూర్పు నావికాదళం, అమెరికా (యూఎస్) యాంపీబియాస్ విన్యాసాల్లో భాగంగా నేవెల్ ఎన్‌క్లేవ్‌లో ఇరుదేశాలు సంయుక్తంగా సైనిక విన్యాసాలు నిర్వహించేందుకు బలగాలు చేరుకున్నాయి. యుద్ధ సమయంలో శత్రుదేశాలపై ఆకాశ, భూమార్గం, సముద్రమార్గంలో త్రివిధ దళాలు జరి పే దాడులు, ఆయుధాల పనితీరు, యుద్ధ ట్యాంకులు, యుద్ధనౌకలు, సైనిక హెలికాప్టర్లు, జెట్ విమానాలతో ఇరుదేశాల త్రివిధ దళాలు ఇప్పటికే సూర్యారావుపేట బీచ్‌కు చేరుకున్నాయి. అమెరికాకు చెంది న 2 యుద్ధ నౌకలు, భారత్‌కు చెందిన యుద్ధ నౌక లు ఇప్పటికే కాకినాడ సముద్ర ప్రాదేశిక డీప్ సీలో ఉన్నాయి. హోవర్ క్రాఫ్టులు, సహాయ కార్యక్రమాలకు వినియోగించే పలు వాహనాలు, యుద్ధ ట్యాంకర్లు, యుద్ధ నౌకలు డీప్ సీలు ఉన్నాయి. ఆర్మీ సిబ్బంది సముద్ర తీరంలో ప్రత్యేక రక్షణ గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. టైగర్ ట్రంప్ యాం పీబియాస్ విన్యాసాలు మంగళవారం నుంచి ఈనెల 13 వరకు జరుగుతాయని త్రివిధ దళాల అధికారులు తెలిపారు. ఇరుదేశాల త్రివిధ దళాల సేనలు బుధవారం నుంచి సముద్రం, ఆకాశంలో విన్యాసాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. విన్యాసాలు జరిగేప్రాంతంలో కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్ పర్యవేక్షణలో కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, తిమ్మాపురం ఎస్‌హెచ్‌వో, ట్రైనీ ఐపీఎస్ సుస్మిత బందోబస్తును పర్యవేక్షించారు.

బీచ్ రోడ్డులో రాకపోకల నిషేధం

కాకినాడ సాగరతీరంలో సైనిక విన్యాసాల నిర్వహణ కోసం వాకలపూడి లైట్‌హౌస్ నుంచి ఉప్పాడ వరకు బీచ్ రోడ్డులో వాహనాల రాకపోకలను నిషేధించినట్టు కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. తిమ్మాపురం పోలీస్ స్టేషన్, యు.కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో బీచ్‌రోడ్డును నిషేధిత ప్రాంతంగా ప్రకటిచారు. బీచ్‌రోడ్డు మీదుగా వెళ్లే వాహనాలు ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగించాలని, ఆంక్షలు ఈనెల 13 వరకు కొనసాగుతాయన్నారు.

విశ్వావసునామ సంవత్సరంలో..

నేటి నుంచి వివాహాది శుభ కార్యక్రమాల సందడి

అమలాపురం రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సరంలో సీతారాముల కల్యాణం పూర్తయిన తర్వాత వరుసగా వివాహాది శుభ కార్యక్రమాలకు చాలా ముహూర్తాలు ఉన్నాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్‌లోని బండారులంకకు చెందిన ఈశ్వర గంటల పంచాంగకర్త కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి తెలిపారు. జూన్ నెలలో గురుమౌఢ్యమితోపాటు జూలై 24 వరకు ఆషాఢమాసం కావడంతో ముహూర్తాలు ఉండవన్నారు. శ్రావణ మాసంలో తిరిగి శుభముహూర్తాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈనెల 9 నుంచి వివాహాది శుభ ముహూర్తాలు వరుసగా ఉన్నాయని చెప్పారు. ఈనెల 27 వరకు చైత్ర మాసం. ఈ మాసంలో శంకుస్థాపనలకు శ్రేష్ఠం కాదు. కానీ ఈ నెలలో 9, 11, 15, 18, 22, 23, 24 తేదీల్లో వివాహ ముహూర్తాలు ఉన్నాయి. ఇక గృహ ప్రవేశాలు ఈనెల 11, 12, 13, 15, 16, 20, 21, 22, 23, 24 తేదీల్లోను, అక్షరాభ్యాసానికి 9, 11, 13, 16, 18, 21, 23, 24 తేదీలు అనుకూలం. ఇక ఈనెల 28 నుంచి మే 27వ తేదీ వరకు వైశాఖ మాసం. ఈ మాసంలో వివాహ ముహూర్తాలు చూస్తే ఏప్రిల్ 29, 30 తేదీలతోపాటు మే1, 7, 8, 9, 11, 14, 15, 16, 17, 21, 22 తేదీలు అనుకూలం. శంకుస్థాపనలకు ఈనెల 29, 30, మే 1, 3, 4, 8, 9 తేదీలు అనుకూలం. మే 11 నుంచి 28 వరకు వాస్తు కర్తరి కావడంతో శంకుస్థాపనలకు, గృహప్రవేశాలకు ముహూర్తాలు ఉండవు. అయితే గృహప్రవేశాలకు ఈనెల 29, 30 తేదీలు, మే 1, 3, 4, 7, 8, 10 తేదీలు మాత్రమే అనుకూలం. అక్షరాభ్యాసానికి ఈనెల 30, మే 1, 3, 4, 8, 9, 11, 14, 16, 21 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి.

జ్యేష్ఠ మాసంలో అంతంతమాత్రంగానే : భీమేశ్వరరావు సిద్ధాంతి

మే 28 నుంచి జూన్ 25వ తేదీ వరకు జ్యేష్ఠ మాసం. ఈ మాసం శంకుస్థాపనలకు శ్రేష్ఠం కాదు. ఇక వివాహ ముహూర్తాలు జూన్ 5, 7, 8 తేదీలు, గృహప్రవేశాలు మే 30, 31, జూన్ 6 తేదీలు. అక్షరాభ్యాసానికి మే 31, జూన్ 2, 5, 6, 7, 8 తేదీలు అనుకూలం. జూన్ 10 నుంచి జూలై 9వ తేదీ వరకు గురుమౌఢ్యమి. జూన్ 26 నుంచి జూలై 24వ తేదీ వరకు ఆషాఢమాసం కావడంతో వివాహాది శుభ ముహూర్తాలు ఉండవు. జూలై 26 నుంచి శ్రావణమాసంలో తిరిగి శుభ ముహూర్తాలు ఉన్నాయి.

భక్తజన వాడపల్లి

అంగరంగ వైభవంగా దేవదేవుడి కల్యాణం

కోనసీమ తిరుమల కళకళలాడింది.. దేవదేవుడు తిరువీధుల్లో తిరుగాడాడు.. భక్తజనానికి కనుల విందు చేశాడు.. స్వామిని వేడుకునేందుకు వేలాదిగా భక్తజనం పోటెత్తారు.. స్వామిని కనులారా చూసేందుకు పోటీపడ్డారు.. గోవిందా..గోవింద అంటూ గొంతెత్తి స్వామిని పిలిచారు.. కొలిచారు.. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామిని భక్తజనం దర్శించుకుని తరించారు.. వాడపల్లి వెంకన్న తీర్థ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మంగళవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి స్వామి రథోత్సవం, దివ్యకల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ క్రతువును భక్తజనం కనులారా వీక్షించి పులకించిపోయారు.



రథోత్సవం..



కల్యాణ మహోత్సవంలో తలంబ్రాల దృశ్యం

- బ్రహ్మాండంగా కోనేటి రాయుని రథోత్సవం
- తిరువీధుల్లో మెరిసిన దేవదేవుడు
- ప్రారంభించిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు
- పులకించిన భక్తజనం

ఆత్రేయపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణమహోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవారం స్వామివారి తీర్థం, రథోత్సవం, కల్యాణోత్సవాలకు వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని కల్యాణోత్సవాలను తిలకించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో ప్రధాన హోమాలు, నిత్యబలిహరణతో కార్యక్రమాలను ప్రారంభించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆర్డీవో శ్రీకర్, డీఎస్పీ సుంకర మురళీమోహన్‌తోపాటు అధికార యంత్రాంగం, కూటమి శ్రేణులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవమూర్తులను ఆలయం ఎదురుగా ఉన్న ఎదుర్కోలు మండపం వద్దకు తోడ్కొని వెళ్లి వేదపండితులు, అర్చకులు ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారు తిరువీధులలో విహరించారు.

రథోత్సవానికి తరలివచ్చిన భక్తజనం...

స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మధ్యాహ్నం మూడు గంటలకు రథంపై స్నపనమూర్తులు వేదమంత్రాల సాక్షిగా అలంకృతలయ్యారు. ఎమ్మెల్యే బండారు రథోత్సవాన్ని ప్రారంభించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తజన గోవిందనామస్మరణతో స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. తిరువీధుల్లో డ్రోన్లతో రథోత్సవంపై పూలవర్షం కురిపించారు. స్వామివారి కల్యాణోత్సవాలలో భాగంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆర్డీవో శ్రీకర్, డీఎస్పీ సుంకర మురళీమోహన్, ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావుతోపాటు అధికార యంత్రాంగం కల్యాణోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎక్కడ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. 200 మంది పోలీస్ సిబ్బంది ఏర్పాట్లలో వివిధ ప్రాంతాల్లో బందోబస్తు నిర్వహించారు. భక్తులకు మజ్జిగ, తాగునీరు, బిస్కెట్లు, అన్నదానం వంటి కార్యక్రమాలు దేవస్థానం, వివిధ స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటుచేశారు.



కల్యాణ వేదిక వద్దకు స్వామివార్లు



రథోత్సవంలో భక్తజనం

కల్యాణం.. కమనీయం

వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి స్వామివారి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం నుంచి స్వామి అమ్మవార్లను మంగళవాయిద్యాలతో శ్రీనివాస ప్రాంగణంలోని కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. సుగంధ పరిమళాలు వెదజల్లే వివిధ రకాల ఫలపుష్పాలతో అలకరించిన కల్యాణ వద్ద స్వామి అమ్మవార్లు ఆశీనులయ్యారు. వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం ఖండవిల్లి వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు స్వామివారి దివ్యకల్యాణ క్రతువును నిర్వహించారు. సుముహూర్త వేళ కన్యాదానం, మాంగళ్యధారణ, తలంబ్రాల తంతును వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు, భక్తజన గోవిందనామస్మరణ నడుమ వైభవంగా నిర్వహించారు. స్వామివారికి పట్టువస్త్రాలను రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఎమ్మెల్యే బండారు సత్యానందరావు-కమలారాణి దంపతులు, జేసీ నిషాంతి, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు-కనకదుర్గాదేవి దంపతులు, ఆర్డీవో శ్రీకర్ దంపతులు, డీఎస్పీ సుంకర మురళీమోహన్ దంపతులు, దేవదాయ డిప్యూటీ కమిషనరు డీఎల్వీ రమేష్‌బాబు, జిల్లా దేవదాయ శాఖ అధికారి సత్యనారాయణ స్వామివారికి సమర్పించారు. స్వామివారి కల్యాణ తంతు జరుగుతుండగా వందల కిలోల హరతికర్పూరంతో జ్యోతిని వెలిగించారు. మిరిమిట్లు గొలిపే బాణసంచా కాల్పులు, విద్యుత్ వెలుగుల నడుమ నిర్వహించిన స్వామివారి కల్యాణాన్ని వేలాదిమంది భక్తులు తిలకించి మంత్రముగ్ధులయ్యారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణ రెడ్డి, జడ్పీటీసీ బోణం సాయి బాబా, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహరావు, కాయల జగన్నాథం, కూటమి నేతలు, భక్తులు పాల్గొన్నారు.



వేడుకలో అతిథులు

డొంకరాయి నుంచి గోదావరి డెల్టాకు..

నీటి విడుదల నిలిపివేత

సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ జీఎం వాసుదేవరావు

సీలేరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): డొంకరాయి జలాశయం స్పిల్‌వే గేట్ల నుంచి గోదావరి డెల్టా రబీ పంటలకు నీటి విడుదలను మంగళవారం నుంచి నిలిపివేసినట్టు సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ జీఎం వాసుదేవరావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గోదావరి డెల్టా రబీ పంటలకు ధవళేశ్వరం వద్ద నీటి మట్టాలు తగ్గుముఖం పట్టడంతోపాటు పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదలయ్యే 4,300 క్యూసెక్కులు సరిపోకపోవడంతో డొంకరాయి నుంచి అదనపు నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు జెన్‌కో ఉన్నతాధికారు లు కోరారన్నారు. ఈ నేపథ్యంలో డొంకరాయి నుంచి ఫిబ్రవరి 10 నుంచి నీటిని 3వేల క్యూసెక్కుల చొప్పున, మార్చి ఒకటి నుంచి 4వేల క్యూసెక్కుల చొప్పున, మార్చి 21 నుంచి 5వేల క్యూసెక్కుల చొప్పున విద్యుత్ ఉత్పత్తి లేకుండా నేరుగా గోదావరి డెల్టాకు విడుదల చేసినట్టు సీఈ తెలిపారు. ఫిబ్రవరి 10 నుంచి ఏప్రిల్ 7 రాత్రి వరకు 15 టీఎంసీఈల నీటిని అందించినట్టు తెలిపారు. ప్రస్తుతం బలిమెల జలాశయంలోని ఆంధ్రా వాటా నీటితో కలిసి డొంకరాయి, గుంటవాడ జలాశయాల్లో మొత్తంగా 48 నుంచి 50 టీఎంసీల వరకు నీటి నిల్వలు ఉన్నాయన్నారు. మండు వేసవిలో సీలేరు కాంప్లెక్సులోని సీలేరు, డొంక రాయి, పొల్లూరు, మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రాల్లో పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తికి చర్యలు చేపడుతున్నట్టు వాసుదేవరావు పేర్కొన్నారు.

బీజేపీలో గ్రూపులు, పైరవీలకు చోటులేదు

- అలాంటి వారిని అధిష్ఠానం ఉపేక్షించదు
- ఎమ్మెల్సీ సోము అభినందన సభలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ



సోమును అభినందిస్తున్న కేంద్ర మంత్రి, ఎమ్మెల్యేలు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో గ్రూపులు, పైరవీలకు చోటు ఉండదని కేంద్ర ఉక్కుశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. అలాంటి వారిని పార్టీ అధిష్ఠానం ఉపేక్షించదనే విషయాన్ని నాయకులు, కార్యకర్తలు గుర్తుంచుకోవాలని స్పష్టం చేశారు. మంగళవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఒక హోటల్‌లో బీజేపీ ఎమ్మెల్సీగా రెండో సారి ఎన్నికైన సోము వీర్రాజుకు అభినందన సత్కారసభ నిర్వహించారు. ఈ సభకు శ్రీనివాసవర్మ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ సోము వీర్రాజు లేకపోతే తాను లేనన్నారు. కమ్యూనిస్టు పార్టీకి చెందిన ఏఐఎస్ఎఫ్‌లో ఉన్న తనను బీజేపీలోకి తీసుకొచ్చింది వీర్రాజేనని, పార్టీలో 30 ఏళ్లుగా కష్టపడి పనిచేయబట్టే ఈ రోజు కేంద్ర మంత్రి పదవి దక్కిందన్నారు. పార్టీ కోసం మనం పడిన కష్టమే గుర్తింపు, పదవులు తెచ్చిపెడుతుందని, సోము వీర్రాజుకు రెండోసారి ఎమ్మెల్సీ పదవి దక్కడం అందుకు ఉదాహరణ అన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ వీర్రాజు 40 ఏళ్ల కిత్రం ఏ పార్టీలో చేరారో అదే రాజకీయపార్టీలో కొనసాగడం ఆయన అంకితభావాన్ని తెలియజేస్తుందన్నారు. శ్రీనివాస వర్మ, దుర్గేష్‌లు వీర్రాజుకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

త్వరలో తమిళనాడు, తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం : సోము

తమిళనాడులో త్వరలో బీజేపీ ప్రభుత్వం వస్తుందని, తర్వాత తెలంగాణాలోనూ తమ ప్రభుత్వం ఏర్పడుతుందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు జోస్యం పలికారు. ఎప్పుడు ఏం చేయాలో బీజేపీకి ఒక వ్యూహం ఉంటుందన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నపుడు ప్రతి నెలా వేల కోట్లు అప్పులు ఇప్పించేవాళ్లం. అంతే చేశాం. పోలవరానికి, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు నిధులు, రైల్వేజోన్ వంటివి ఇవ్వలేదన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు సీఎం అయ్యాక డబుల్ ఇంజన్ సర్కార్ రావడంతో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. రాష్ట్రంలోని రొయ్యల రైతుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంతోపాటు, కేంద్ర మంతి శ్రీనివాసవర్మ కృషి చేస్తారన్నారు. జిల్లా మాజీ అధ్యక్షుడు బొమ్ముల దత్తు పర్యవేక్షణలో జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ అభినందన సభలో బీజేపీ ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఈశ్వరరావు, బీవీఎన్ మాధవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, వేటుకూరి సూర్యనారాయణరాజు, బీజేపీ యువమోర్చా నాయకుడు నాగిరెడ్డి దుర్గామహేష్, పాకా సత్యనారాయణ, కంబాల శ్రీనివాసరావు, భద్రం మాట్లాడారు. రాష్ట్ర నాయకులు నిర్మల, ముళ్లపూడి రేణుక, రేలంగి శ్రీదేవి, అయినంపూడి శ్రీదేవి పాల్గొన్నారు. కాపు సంఘం నాయకులు, జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు సోము వీర్రాజును ఘనంగా సత్కరించారు. అంతకుముందు కోటిపల్లి బస్టాండు సెంటర్ నుంచి సభా వేదిక వరకూ నిర్వహించిన భారీ ర్యాలీలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సోము వీర్రాజు



మంత్రి కందుల దుర్గేష్

సచివాలయ ఉద్యోగిని అనుమానాస్పద మృతి

మృతురాలి బంధువులను పరామర్శించిన మంత్రి దుర్గేష్



మృతిచెందిన నెల్లి కరుణ

నిడదవోలు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగిని అనుమానాస్పదస్థితిలో మృతిచెందింది. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం కోరుమామిడి గ్రామానికి చెందిన నెల్లి కరుణ(25) నిడదవోలు 9వ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తుంది. రోజూలాగే సోమవారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వచ్చి చర్చికి వెళ్లినట్టు తల్లి నెల్లి సూర్యకుమారి తెలిపింది. చర్చి నుంచి వచ్చిన తరువాత కడుపునొప్పి వచ్చి అస్వస్థతకు గురైందని, నిడదవోలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో అక్కడ నుంచి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్తుండగా మృతిచెందినట్టు ధ్రువీకరించారని చెప్పింది. దీనిపై సమిశ్రగూడెం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చేయగా ఎస్ఐ వీరబాబు మృతదేహాన్ని పరిశీలించి మంగళవారం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ మృతురాలి కుటుంబీకులను మంత్రి దుర్గేష్ పరామర్శించారు. కరుణ మృతిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు.

తల్లిని చూసేందుకు వెళ్తుండగా...

ఇసుక లారీ ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన గోవిందు

ఆత్రేయపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తల్లిని చూసేందుకు వెళ్తున్న వ్యక్తిని ఇసుక లారీ ఢీకొనడంతో మృతిచెందాడు. వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం గజ్జరం గ్రామానికి చెందిన కడలి గోవిందు (44) వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నాడు. మంగ ళవారం తన తల్లిని చూడడానికి మట్లదొడ్డి గ్రామానికి వెళ్తుండగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం మెర్లపాలెం మావుళ్లగుడి సమీపంలో రావులపాలెం నుంచి ఆత్రేయపురం వస్తున్న ఇసుక లారీ ఎదురుగా మోటార్‌సైకిల్‌పై గోవిందును బలంగా ఢీకొనడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. ఎస్ఐ రాము కేసు నమోదు చేశారు.

సభకు విచ్చేయండి

యనమల 42 వసంతాల రాజకీయ ప్రస్థానంపై రేపు పుస్తకావిష్కరణ

కార్యక్రమానికి రావాల్సిందిగా అతిథులకు టీడీపీ నేతల ఆహ్వానాలు

తుని రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): యనమల 42 వసంతాల రాజకీయ ప్రస్థానం పుస్తకావిష్కరణ సభకు రావాల్సిందిగా అతిథులకు తుని నియోజకవర్గ టీడీపీ, జనసేన నాయకులు ఆహ్వానం పలికారు. యనమల రామకృష్ణుడు రాజకీయ జీవితంపై ప్రచురించిన ఈ పుస్తకాన్ని ఈనెల 10న కాకినాడ జిల్లా తునిలో ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోంమంత్రి అనిత విచ్చేయనున్నారు. ఈ సభకు హాజరుకావాల్సిందిగా అతిథులను టీడీపీ నేత యనమల రాజేష్ స్వయంగా ఆహ్వానపత్రాలు అందజేసి ఆహ్వానిస్తున్నారు. ఇప్పటికే కొందరికి వీటిని అందజేశారు. మంగళవారం ఆయన కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు నవీన్, సీనియర్ నేత పిల్లి సత్యనారాయణమూర్తి ఆహ్వానపత్రాలు అందజేశారు. సభ విజయవంతానికి టీడీపీ, జనసేన శ్రేణులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

గోదావరి జలాల కాలుష్యంపై

డెల్టాయిక్ ప్రాంతీయ కేంద్రం అధ్యయనం

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

సామర్లకోట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట గోదావరి కాలువ జలాల కాలుష్యంపై అధ్యయనం చేసేందుకు కేంద్రీయ హైడ్రాలజీ ఇనిస్టిట్యూట్ డెల్టాయిక్ ప్రాంతీయ కేంద్రం అంగీకరించింది. 'ఆ మూడింటికీ నీటి ఎద్దడి తప్పదా' పేరిట ఆంధ్ర జ్యోతిలో ఈ నెల 6న కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీంతో జిల్లా ఉన్నతాధి కారులు స్పందించి తక్షణం మున్సిపల్ అధికారులను ఆదేశించారు. డెల్టాయిక్ ప్రాంతీయ కేంద్రం శాస్త్రవేత్త ఎస్వీ విజయకుమార్ ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు మంగళవారం లేఖ పంపారు. శాస్త్రీయ పరిశోధనలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అందించడం ద్వారా కాలుష్య మూల కాలు, కలుషితాలను గుర్తించేందుకు తూర్పు డెల్టా కాలువలో పూర్తిస్థాయిలో అధ్యయనం చేసేందుకు తగిన రీతిలో నివేదికలు రూపొం దించేందుకు కాలుష్య నియంత్రణ మండలి, ఇరిగేషన్, వ్యవసాయ, పుర పాలక, ఏపీ రాష్ట్ర లీడ్ కార్పొరేషన్ వంటి శాఖల అధికారుల సమన్వయం ఎంతో అవసరమని హైడ్రాలజిస్ట్ విజయకుమార్ కమిషనర్‌కు రాసిన ఆ లేఖలో తెలిపారు.

ఐవీఆర్ఎస్ సర్వేలో

అన్నవరం దేవస్థానానికి రెండో స్థానం

అన్నవరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): భక్తుల సౌకర్యాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఐవీఆర్ఎస్ సర్వేలో అన్నవరం దేవస్థానం రెండో స్థానాన్ని పదిలం చేసుకుంది. మొదటి నెల సర్వేలో చివరిస్థానంలో ఉండడంతో కాకినాడ జిల్లా కలెక్టర్ అన్నవరం ఆలయంపై ప్రత్యేక దృష్టిసారించి ఈవో వీర్ల సుబ్బారావుకు సూచనలు చేయడం వాటిని ఆయన అమలుపరుస్తూ రెండో నెల సర్వేలో రెండో స్థానానికి చేరుకుంది. మూడో నెల సర్వే వివరాలు మంగళవారం వెల్లడించారు. వీటిలో శ్రీకాళహస్తి దేవస్థానం మొదటిస్థానంలో ఉండగా చివరి స్థానంలో సింహాచలం చేరింది. ఇదిలాఉండగా భక్తుల తమ అభిప్రాయాల సేకరణకు చేపట్టిన క్యూఆర్ కోడ్ స్కానర్‌కు సంబంధించి అన్నవరం దేవస్థానానికి విచ్చేసిన భక్తులు ఎక్కువగా స్కాన్ చేయడం విశేషం. మొత్తం 6682 మంది భక్తులు ఈ నెలలో స్కాన్‌చేయగా ఐవీఆర్ఎస్ కాల్స్‌లో 3284 మంది స్పందించి వివరాలు తెలియజేశారు. దర్శనం సంతృప్తిగా జరిగినట్టు 93శాతం తెలుపగా, మౌలిక వసతులు బాగున్నట్టు 86శాతం మంది అభిప్రాయం తెలిపారు. 94శాతం మంది అన్నవరం ప్రసాదం రుచిగా ఉందన్నారు. దేవాలయంలో పారిశుధ్య నిర్వహణ బాగుందని 93శాతం మంది ఐవీఆర్ఎస్ సర్వేలో తెలియజేశారు. తదుపరి సర్వేలో మొదటిస్థానం చేరుకునేందుకు చర్యలు తీసుకుంటామని ఈవో తెలిపారు. సిబ్బందిని సమన్వయం చేయడంతో ఇది సాధ్యమవుతుందని పేర్కొన్నారు.



పండిత సదస్యం నిర్వహిస్తున్న దృశ్యం

రామాలయంలో పండిత సదస్యం

సీతారాముల దివ్యకల్యాణోత్సవాల్లో భాగంగా అన్నవరం దేవస్థానం క్షేత్రపాలకులైన రామాలయంలో మంగళవారం సాయంత్రం 4గంటలకు నవదంపతులైన సీతారాములను, పెండ్లిపెద్దలైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను ఆశీనులుగావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హాజరైన పండితులు తమ పాండిత్యాన్ని నవదంపతుల ముందు వినిపించారు. పండితులకు విసినకర్ర, మదురఫలాలు, నగదు పారితోషకం అందించారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు దంపతులు ఉన్నారు.





పట్టువస్త్రాలు సమర్పిస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, శ్రీనివాసరావు

భక్తజనుల వాడా..

భక్తజనులవాడా.. వాడపల్లి వేంకటేశ్వరుడా అంటూ భక్తులు మొక్కారు.. కనులారా దర్శించుకుని.. మనసారా వేడుకున్నారు.. వాడపల్లి వేంకటేశ్వరుడి కల్యాణోత్సవాల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం ఉదయం రథోత్సవం సాగింది.. తిరువీధుల ఊరేగిన స్వామిని కనులారా దర్శించుకుని ఏడుకొండల వాడా వెంకన్నా అంటూ కొలిచారు.. సాయంత్రం కల్యాణ క్రతువు వేడుకగా సాగింది. ప్రత్యేక అలంకరణలో స్వామి తమ చెంతకే రావడంతో కన్నులారా చూసిన భక్తజనం పులకించిపోయారు.. తన్మయత్వంతో ఊగిపోయారు. - వివరాలు 6లో



చూసిన కనులదే భాగ్యమట : వేడుకగా స్వామి కల్యాణం



వంటింట్లో.. గ్యాస్ మంట!

- సిలిండర్ ధర రూ.50 పెంపు
- వినియోగదారులపై అదనపు భారం

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): వంటగ్యాస్ సిలిండర్ ధర చమురు కంపెనీలు ఒక్కసారిగా రూ.50 పెంచాయి. అమాంతం పెరిగిన ఈ ధరతో సామాన్యులు బెంబేలెత్తు తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 17లక్షల97వేల గ్యాస్‌కనెక్షన్లు ఉన్నాయి. ఒక గ్యాస్ సిలిండర్‌పై రూ.50 ధరను పెంచడంతో వినియోగదారులు రూ.8కోట్ల98లక్షలవరకు అదనంగా చెల్లించాల్సి ఉంది. దీనిలో కాకినాడ జిల్లాలో 6లక్షల92వేల కనెక్షన్లు, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 5లక్షల30వేల గ్యాస్‌కనెక్షన్లు, తూర్పుగోదావరి జిల్లాలో 5లక్షల70వేల వరకు కనెక్షన్లు ఉన్నాయి. కాకినాడలో వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.831 ఉండగా మంగళవారంనుంచి రూ.881 పెట్టి వినియోగదారులు కొనుగోలు చేశారు. పెరిగిన ధరలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటికే అమలులోకి వచ్చాయి. ఉజ్వల పథకంలో ఒక సిలిండర్ ధర రూ.503 ఉండగా అది కాస్తా రూ.553కు ధర పెరిగింది. పెరిగిన ధరలపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గ్యాస్ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇక డిపాజిటర్లకు.. జయమే!



కాకినాడ జిల్లా సర్పవరం జంక్షన్‌లోని జయలక్ష్మి కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయం

'జయ'ం జరిగేలా సర్కారు అడుగులు

- జయలక్ష్మి బాధితులకు అండ
- సీఎం దృష్టికి తీసుకువెళ్లిన కలెక్టర్
- సీఐడీతో ప్రభుత్వం సంప్రదింపులు
- రూ.450 కోట్ల ఆస్తుల వేలం
- 11న సీఎం చెంతకు పాలకవర్గం
- జూన్‌కల్లా కొంత చెల్లించే యత్నం
- గడువు విధించిన అధికారులు
- మూడేళ్ల కిందట ఘటన
- రూ.582 కోట్లకు శఠగోపం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఒకటి కాదు..రెండు కాదు..ఏకంగా రూ.582 కోట్ల కుంభకోణం..జరిగి మూడేళ్లయినా ఇప్పటికీ బాధితులకు న్యాయం దక్కలేదు.. గత వైసీపీ ప్రభుత్వం అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేసేసి బాధితులకు తీరని అన్యాయం చేసింది.. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు అండగా నిలబడేందుకు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించింది.. సీఐడీ సీజ్ చేసిన రూ.450 కోట్ల సొసైటీ ఆస్తులను ఎలాగైనా వేలం వేసి బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.ఈ మేరకు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఇప్పటికే ఈ వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో వేలం ప్రక్రియకు వేగంగా అడుగులు పడుతున్నాయి. తొలివిడత రూ.200 కోట్లయినా చేతికి అందితే బాధితులకు న్యాయం జరిగే అవకాశం ఉండడంతో ఆ దిశగా ప్రయత్నాలు ఊపందుకున్నాయి.అటు సొసైటీ పాలకవర్గం సైతం ఈ నెల 11న సీఎం చంద్రబాబును కలవడానికి సన్నాహాలు చేస్తోంది. బాధితులకు న్యాయం చేయాలని సీఎంను కోరనుంది.జూన్‌లోపు బాధితులకు 25 శాతమైనా నగదు చెల్లించాలని ప్రయత్నాలు చేస్తోంది.

ప్రభుత్వం మారడంతో చకచకా..

రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఇప్పుడు సొసైటీ బాధితులకు న్యాయం చేసేందుకు వేగం గా అడుగులు పడుతున్నాయి.ఇటీవల కలెక్టర్ల సదస్సులో ఈ అంశంపై జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సీఎం చంద్రబాబుతో చర్చించారు. సీఐడీ అటాచ్‌లో ఉన్న రూ.450 కోట్ల స్థిరాస్తులను వేలం వేసేలా చర్యలు చేపడితే బాధితులకు న్యాయం జరుగుతుందని వివరించారు. తొలుత సీఐడీతో ప్రభుత్వం చర్చించి వేలం ప్రక్రియ ముందుకు సాగేలా ప్రస్తుతం చర్యలు చేపట్టింది. వేలానికి అన్నీ అనుకూలిస్తే నెల వ్యవధిలో ప్రక్రియ ముగించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు.దీంతో బాధితుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. వైస్ చైర్మన్ విశాలాక్షి మేనల్లుడు ఆకెళ్ల ఉదయశంకర్ రూ.60 కోట్లతో లండన్ చెక్కేయడంతో సీఐడీ ఇప్పటికే లుక్ అవుట్ నోటీసు..తాజాగా రెడ్‌కార్నర్ నోటీసు జారీ చేశారు.హైదరాబాద్‌లో నిందితుడికి చెందిన రూ.150 కోట్ల విలువైన 14 స్థిరాస్తులను సీఐడీ సీజ్ చేసింది. లోన్లు తీసుకున్న 235 మందిపై ట్రిబ్యునల్‌లో కేసు నమోదు చేయగా 40 మందిపై కోర్టులో నెంబర్ దాఖలైంది.

రూ.582 కుంభకోణానికి మూడేళ్లు

కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్ ప్రధాన కేంద్రంగా ది జయలక్ష్మి మ్యూచువల్ ఎయిడెడ్ మల్టీపర్పస్ కోపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పేరుతో ఎన్నో ఏళ్లుగా ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించేది. మూడేళ్ల కిందట ఈ సంస్థ డిపాజిటర్లను మోసం చేసింది. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, విశాఖ జిల్లాల్లో 29 బ్రాంచీల ద్వారా 20 వేల మంది నుంచి రూ.582 కోట్ల వరకు డిపాజిట్లు సేకరించి 2022 ఏప్రిల్ 6న బోర్డు తిప్పేసింది. బాధితుల ఆందోళనలతో ప్రభుత్వం విచారణకు ఆదేశించగా రూ.582 కోట్ల మేర ఆర్థిక మోసం జరిగినట్టు జిల్లా సహకారశాఖ, సీబీసీఐడీ అధికారులు 348 పేజీల నివేదికను 2023లో అప్పటి ప్రభుత్వానికి అందించారు. ఈ ఆర్థిక కుంభకోణానికి ప్రధాన సూత్రదారులుగా జయలక్ష్మి సొసైటీ చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులు, వైస్‌చైర్మన్ రాయవరపు బదరీ విశాలాక్షి, ఇతర డైరెక్టర్లు రాయవరపు జయమణి, చక్రభాస్కరరావు, ప్రబల మల్లికార్జునరావు, మంగళంపల్లి వెంకట సుబ్రహ్మణ్యకుమార్, వారణాసి శాంతేశ్వరరావు, దూళ్ల శ్రీనివాస్, ఆర్.నాగేశ్వరరావు, జయశంకర్‌లుగా నిర్ధారించి నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. సీఐడీ విచారణ తర్వాత కుంభకోణంలో 159 మంది పాత్ర ఉన్నట్టు గుర్తించి అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచింది. 98 ఆస్తులకు చెందిన రూ.450 కోట్ల విలువైన స్థిరాస్తులను సొసైటీ చొరవతో సీఐడీ సీజ్ చేసి కోర్టుకు అటాచ్ చేసింది. ఈ ఆస్తులపై సేల్ ఆర్డర్ కోసం ప్రస్తుతం కేసు కోర్టు పరిధిలో నడుస్తోంది. నూతన పాలకవర్గం చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు ఇది వరకే సొసైటీ నుంచి రుణాలు తీసుకున్న వారి నుంచి రూ.6 కోట్లు వసూలు చేసి బ్యాంకులో డిపాజిట్ చేశారు. ఇంకో రూ.6 కోట్లు సీఐడీ సీజ్ చేసిన దాంట్లో కోర్టులో పెండింగ్‌లో ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు నేతలు ఈ ఆస్తులపై కన్నేసి కొట్టేశారు.

త్వరలో మరిన్ని జీవోలు..

కుంభకోణానికి సంబంధించి 21,895 మంది డిపాజిట్‌దారులకు 2022 నాటికి వడ్డీతో కలిపి మొత్తం రూ.511 కోట్లు చెల్లించాల్సి ఉన్నట్లు ఇప్పటికే లెక్కలు తేల్చారు. ప్రధానంగా రూ.లక్ష లోపు డిపాజిట్‌దారులు 13,249 మంది ఉండగా, రూ.32.72 కోట్లు చెల్లించాల్సి ఉంది. రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల మధ్య డిపాజిట్‌దారులు 2,384 మంది ఉండగా వీరికి రూ.37.83 కోట్లు, రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల్లోపు 810 మంది ఉండగా వీరికి రూ.27.99 కోట్లు, రూ.5 లక్షల లోపు 677 మంది బాధితులు ఉండగా వీరికి రూ.30.41 కోట్లు, రూ.5 లక్షలు ఆపైన బాధితులు 2,563 మంది ఉండగా వీరికి రూ.349 కోట్లు చెల్లించాల్సి ఉంది. రూ.582 కోట్ల కుంభకోణంలో వైస్ చైర్మన్ విశాలాక్షి ఒక్కరే ఎటువంటి పూచీకత్తు లేకుండా బినామీలతో రూ.300 కోట్లు కొట్టేయడం గమనార్హం. ఇప్పటి వరకు 98 ఆస్తులకు చెందిన రూ.450 కోట్ల స్థిరాస్తులను సీఐడీ సీజ్ చేయగా ఈ ఆస్తుల స్వాధీనానికి ప్రభుత్వం 12 జీవోలు జారీ చేసింది.మరో ఐదు జీవోలు విడుదల చేయాల్సి ఉండగా మరో వారంలో రూ.100 కోట్ల ఆస్తుల సీజ్ కోసం రెండు జీవోలు ప్రభుత్వం విడుదల చేసే అవకాశం ఉంది.

ప్రత్యేక ఆర్డినెన్స్ అవసరం

కూటమి ప్రభుత్వంలో జయలక్ష్మి సొసైటీ బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందన్న నమ్మకం కలిగింది. ఇటీవల కలెక్టర్ల సదస్సులో జయలక్ష్మి వ్యవహారంపై సీఎం చర్చించడం మంచి పరిణామం. ఇప్పటికే కలెక్టర్ ద్వారా సహకారశాఖ కమిషనర్, సీఐడీ ద్వారా సీఎంకు లెటర్లు పంపాం. సొసైటీ సమగ్ర నివేదిక, సీజ్ చేసిన ఆస్తులు, తదితర వివరాలన్నీ కలిపి సొసైటీ పాలకవర్గం సభ్యులతో ఈనెల 11న సీఎం చంద్రబాబును కలవబోతున్నాం. సొసైటీ బాధ్యతలు తీసుకున్న సమయంలో ఒక్క రూపాయికి కూడా లేని స్థితినుంచి రూ.500 కోట్లకుపైగా ఆస్తుల గుర్తింపు, స్వాధీనం చేసుకోవడంలో పోలీసు, సీఐడీకి సహకరించాం.బాధితులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకువస్తే సేల్ ఆర్డర్స్ వేగంగా వచ్చే అవకాశం ఉంది.

- గంగిరెడ్డి త్రినాథరావు, చైర్మన్, జయలక్ష్మి సొసైటీ

పోలవరం.. పరుగు



- చకచకా సాగుతున్న పనులు
- ఇప్పటి వరకూ 55.9 శాతం
- ఒక పక్క డయాఫ్రం వాల్
- మరో పక్క ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్
- 2027 డిసెంబర్‌కి ప్రాజెక్టు
- రెండేళ్లలో పూర్తిచేయడం లక్ష్యం
- సీఎం చంద్రబాబు రాకతో వేగం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రతిష్ఠాత్మక పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతమయ్యాయి. డయాఫ్రంవాల్ నిర్మాణానికి సన్నాహ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ఏడాది జనవరి 18న డయాఫ్రం వాల్ పనులు ఆరంభించారు. మొత్తం 1396.6 మీటర్ల మేర ఈ వాల్‌ను నిర్మించాల్సి ఉంది. ఇప్పటి వరకూ 158.2 మీటర్ల మేర నిర్మించారు.ఇంకా సుమారు 1238 మీటర్ల వాల్ నిర్మించాల్సి ఉంది.ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీకి దీనిని పూర్తి చేసి 2026 జనవరి1కి ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పడానికి నిర్ణయించుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. డయా ఫ్రం వాల్ మీదనే అసలు డ్యామ్ అయిన ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ (ఈసీఆర్‌ఎఫ్) నిర్మించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో డయాఫ్రంవాల్ నిర్మాణం పూర్తయ్యే వరకూ వేచి ఉండకుండా దానికి సమాంతరంగా ఇరువైపులా ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్ నిర్మాణ పనులు చేయడానికి నిర్ణయించారు. ఈసీఆర్‌ఎఫ్ గ్యాప్-1ను పూర్తి చేసే పనిలో అధికారులు, యంత్రాలు నిమగ్నమయ్యాయి. సీఎం నారా చంద్రబాబునాయుడు ఇటీవల స్వయంగా ప్రాజెక్టు పరిశీలించి అధికారులకు సూచనలు చేయడంతో పనులు వేగవంతం అయ్యాయి.2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని ప్రభుత్వం చెబుతోంది.

పనులు జరిగిన తీరిది..

ఇప్పటి వరకూ పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి మొత్తం పనులు 55.90 శాతం జరిగాయి.సివిల్ వర్క్సు 78.56 శాతం, హెడ్ వర్క్సు పనులు 76.43 శాతం,కుడి ప్రధాన కాలువ (ఆర్ఎంసి) పనులు 92.75 శాతం, ఎడమ ప్రధాన కాలువ(ఎల్ఎంసి) పనులు 74.43 శాతం, భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులు 25.11 శాతం జరిగాయి.వైసీపీలో చతికిలపడిన ప్రాజెక్టును కొత్త ప్రభుత్వం గాడిలో పెట్టింది.2024 జూన్ నుంచి ఇప్పటి వరకూ సుమారు 7 శాతం పనులు జరిగాయి.

ఇదీ యాక్షన్ ప్లాన్

పోలవరం ప్రాజెక్టు హెడ్‌వర్క్సుకు సంబంధించి అధికారులు స్పష్టమైన ప్రణాళికతో ఉన్నారు. ఈసీఆర్‌ఎఫ్ గ్యాప్ -1 పనులు 2024 డిసెంబర్ 10న ప్రారంభించారు.2026 మార్చి 31కి పూర్తి చేసే లక్ష్యంతో పనిచేస్తున్నారు. డయాఫ్రంవాల్ పనులు ఈ ఏడాది జనవరి 18న ఆరంభించారు.ఈ ఏడాది డిసెంబర్ 31కి పూర్తి చేసే లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఈసీఆర్‌ఎఫ్ గ్యాప్-2 పనులు ఇంకా మొదలుకాలేదు. ఇవి త్వరలో మొదలు పెట్టి 2027 డిసెంబర్ 27కి పూర్తి చేసే లక్ష్యంతో ఉన్నారు.ఇవి పూర్తయితే ప్రాజెక్టు పూర్తయినట్టే. కుడి వైపు అనుబంధ పనులు వచ్చే ఏడాది జూలై 31కి పూర్తి చేయడంతో పాటు ఎడమ వైపు అనుబంధ పనులు 2027 ఫిబ్రవరి 28కి పూర్తి చేసే లక్ష్యంతో ఉన్నారు.ఇక భూసేకరణ, ఆర్ అండ్ ఆర్, కాలనీల నిర్మాణం, కుటుంబాల తరలింపు పనులపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. మరో పక్క పవర్ ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయి.స్పిల్‌వే పూర్తి కావడంతో ఇప్పటికే గోదావరి నీటిని స్పిల్‌వే గుండా ధవళేశ్వరం బ్యారేజీ వైపు వదిలేస్తున్న సంగతి తెలిసిందే.

11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఈనెల 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రి ఎదురుగా ఉన్న మహాత్మ జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారన్నారు.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోండి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): డెలివరీ రంగంలో పనిచేసే ఉద్యోగుల, కార్మికులు ఉచితంగా పేరు నమోదు చేసుకుని కార్మిక మంత్రిత్వ శాఖ జారీచేసే గుర్తింపు కార్డు పొందడం ద్వారా సంక్షేమ పథకాలు పొందవచ్చునని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. అమెజాన్, జొమాటో, స్విగ్గీ, ఉబెర్, రాపిడో, ఓలా, బిగ్‌బాస్కెట్, ఫ్లిప్‌క్కార్ట్, బ్లింకిట్ లాంటి సంస్థల్లో పనిచేసే కార్మికులు ప్లాట్‌ఫారం వర్కర్స్‌గా గుర్తింపు కలిగి, గిగ్-ఆధారిత పద్ధతిలో ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం ద్వారా పనిచేసే అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికుల కోసం జారీ చేసే గుర్తింపు కార్డులు పొందడానికి అర్హులన్నారు. తద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలను పొందడానికి అర్హులవుతారన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 17 వరకు ప్రత్యేక ప్రచార, అవగాహన, నమోదు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈశ్రమ్ నమోదుకు వయస్సు 16 నుంచి 59ఏళ్ల మధ్య ఉండాలన్నారు. ఆదాయపన్ను పరిధిలో లేనివారు ప్రయోజనం పొందవచ్చన్నారు.

39 ప్రాంతాలు టీబీ ముక్తి పంచాయతీలుగా ఎంపిక: డీఎంహెచ్‌వో

జీజీహెచ్(కాకినాడ),ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జాతీయ క్షయ నివారణా కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి టీబీ ముక్తి పంచాయత్-2024 సంవత్సరానికిగాను కాకినాడ జిల్లాలో 39 పంచాయతీలను టీబీ ముక్తి పంచాయతీలుగా ఎంపికైనట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ జె.నరసింహ నాయక్ మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో 5 వెండిరంగు గాంధీ విగ్రహాలకు, 34 కాంస్య రంగు గాంధీ విగ్రహాలుకు ఎంపిక చేశామన్నారు. పంచాయతీలో ఉన్న వెయ్యి మంది జనాభాకుగాను 30మందికి పైన క్షయ అనుమానిత పరీక్షలు, ఒకటి కంటే తక్కువ ఉన్న టీబీ కేసులు, వాటికి రిఫామ్పిన్ స్థితి, ఒక పోషకాహార కిట్, కనీసం ఒక నెల నిక్షయ్ పోషణ యోజన పథకం ద్వారా డబ్బులు వారి ఖాతాలో జమ చేస్తారన్నారు. ఆ గ్రామంలో ఉన్న టీబీ రోగులు క్రమం తప్పకుండా పూర్తి కాలం మందులు వాడి స్వస్థత చెంది ఉండాలన్నారు. పైసూచికల ద్వారా ఈ 39 పంచాయతీలు ఎంపికయ్యాయన్నారు. డీఎంహెచ్ఓ ఆధ్వర్యంలో వైద్యాధికారులు టీబీ లక్షణాల గురించి పంచాయతీ సెక్రటరీలకు వివరించారన్నారు. 39 పంచాయతీలకు తనతోపాటు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి డాక్టర్ ఆర్.రమేష్‌తో కలిసి గాంధీ విగ్రహాలు, సర్టిఫికెట్‌లు పంచాయతీ సెక్రటరీలకు అందజేశామని డీఎంహెచ్‌వో తెలిపారు. జిల్లాను పూర్తిస్థాయిలో క్షయరహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖ పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు.



పంచాయతీ సెక్రటరీకి సర్టిఫికెట్ అందజేస్తున్న డీఎంహెచ్‌వో

మరో రూ.5కోట్లు

- రెండో విడత ఎంపీ లాడ్స్ నిధులు విడుదల
- అభివృద్ధి పనులకు మొత్తంగా రూ.10కోట్లు సిద్ధం

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ పార్లమెంటు పరిధిలో అభివృద్ధి పనులు చేసేందుకు ఎంపీ లాడ్స్ రెండో విడత నిధులు విడుదలయ్యాయి. గతేడాది తొలి విడతగా రూ.5కోట్లు నిధులు విడుదల చేశారు. తాజాగా ఇప్పుడు రెండో విడత మరో రూ.5కోట్లు నిధులు విడుదల చేశారు. మొత్తంగా రూ.10కోట్లు నిధులు అభివృద్ధి పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. కాకినాడ పార్లమెంటు పరిధిలో కాకినాడ అర్బన్, కాకినాడ రూరల్, పిఠాపురం, ప్రత్తిపాడు, తుని, జగ్గంపేట, పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గాలు ఏడు ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లో ఈ నిధులతో రోడ్లు, డ్రైన్లు, విద్యుత్‌సరఫరా, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు, పాఠశాల, కమ్యూనిటీ భవనాల నిర్మాణాలు చేయవచ్చు. గతేడాది విడుదలైన నిధులను ఏ పనులకు కేటాయించలేదు. ఈ నేపథ్యంలో కొంత వరకు జాప్యం జరిగింది. తాజాగా మరో రూ.5కోట్లు నిధులు విడుదల అవ్వడంతో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది.

రూ.2.5కోట్లకు కేటాయింపులు

జిల్లాకు ఎంపీ లాడ్స్ నిధులు మొత్తంగా రూ.10కోట్లు సిద్ధంగా ఉండగా ఇప్పటివరకు రూ.2.5కోట్లు వివిధ అభివృద్ధి పనులకు కేటాయించారు. దీనిలో జగ్గంపేటలో ఏలేరు కెనాల్‌పై రిటర్నింగ్ వాల్ నిర్మాణానికి రూ.60లక్షలు కేటాయించారు. తొండంగి మండలం, పెద్దాపురం, సామర్లకోట మున్సిపాల్టీల్లో రూ.కోటితో కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకు నిధులు కేటాయించారు. యు.కొత్తపల్లి, పిఠాపురం, కరప మండలాల్లో పార్కుల అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.50లక్షల నిధులు కేటాయించారు. కాకినాడ దుమ్ములపేటలో కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు రూ.30లక్షలు కేటాయించారు. మిగిలిన రూ.7.5కోట్లకు అభివృద్ధి పనుల నిమిత్తం పనులకు అంచనాలురూపకల్పన చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. మరో వారంలో పనులు కార్యరూపం దాలుస్తాయన్నారు.

గత ప్రభుత్వంలో అరకొర పనులు

గత వైసీపీ ప్రభుత్వంలో ఎంపీ లాడ్స్ నిధులతో పనులు అరకొరగా నిర్వహించారు. అప్పటి కాకినాడ ఎంపీకి రూ.20కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించే అవకాశం లభించింది. కానీ, ఆశించినస్థాయిలో పనులు నిర్వహించలేకపోయారు. రూ.20కోట్లతో 361 పనులకు ప్రతిపాదించారు. 2024 సార్వత్రిక ఎన్నికల నాటికి రూ.10కోట్లతో కేవలం 156 పనులను మాత్రమే పూర్తిచేశారు. ఇంకా రూ.10కోట్లతో 165 పనులను పెండింగ్‌లోనే ఉంచేశారు.

నేరాల కట్టడికి డ్రోన్‌లు దోహదం: ఎస్పీ

కాకినాడక్రైం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నేరాల కట్టడికి డ్రోన్‌లు ఎంతగానో దోహదపడతాయని ఎస్పీ జి.బింధుమాధవ్ మంగళవారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నగర, గ్రామీణ ప్రాంత శివార్లలోని సునిశిత ప్రాంతాలపై పటిష్ఠమైన నిఘా పెట్టేందుకు డ్రోన్స్‌ను వినియోగిస్తున్నామ ఆయన తెలిపారు. తద్వారా సత్ఫలితాలను సాధిస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా నేరాలను నియంత్రించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరాలు జరిగేందుకు అవకాశాలున్న శివారు ప్రాంతాలు, తోటలు, బహిరంగ ప్రదేశాలు,పార్కులను ముందుగా గుర్తించి ఆయా ప్రాంతాలపై డ్రోన్స్ పంపి పటిష్ఠ నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులోభాగంగా మంగళవారం కాకినాడ నగరంలోని భానుగుడి జంక్షన్, రైల్వేస్టేషన్, బాలాజీచెరువు సెంటర్, పోర్టు పరిసర ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా నిఘా నిర్వహించామన్నారు.



నగరాన్ని జల్లెడ పడుతున్నట్టుగా డ్రోన్ సాయంతో తీసిన చిత్రం

80వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలి: జేసీ

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఈ రబీ సీజన్‌లో జిల్లాలో 80వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని జేసీ రాహుల్‌మీనా ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో విధాన గౌతమి సమావేశ మందిరంలో ధాన్యం సేకరణ సిబ్బందికి శిక్షణా తరగతులు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ చేయాలన్నారు. క్వింటా గ్రేడ్-ఏరకం రూ.2320కి, సాధరణ రకం ధాన్యం క్వింటా రూ.2300 ధరకి ధాన్యం సేకరించాలన్నారు. ధాన్యం తేమ శాతం 17శాతం వరకు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. తేమ విషయంలో రైతులను ఇబ్బందులు కల్గించవద్దని సూచించారు. జిల్లాలో 225 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈనెల 3 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామన్నారు. రబీ ధాన్యం కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేకంగా అధికారులు వివరించారు. పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ దేవులనాయక్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సత్యనారాయణరాజు, తహసీల్దార్లు, వ్యవసాయశాఖ అధికారులు, కస్టోడియన్ అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్ మీనా

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి 13న పరీక్ష

పిఠాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌ల్లో ప్రవేశానికి ఈ నెల 13వ తేదీన పరీక్ష నిర్వహిస్తున్నట్టు పిఠాపురం కళాశాల ప్రిన్సిపాల్ పీవీ త్రివేణి తెలిపారు. 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్‌లో ప్రవేశం కోసం మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. హాల్ టిక్కెట్లను https://apbragcet.apcfss.in/ వెబ్‌సైట్ ద్వారా పొందాలని సూచించారు. పరీక్షకు హాల్ టిక్కెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో హాజరు కావాలని కోరారు.





పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప, కల్యాణమూర్తులైన స్వామి, అమ్మవార్లు

వైభవంగా శృంగారవల్లభస్వామి కల్యాణం

పెద్దాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తొలి తిరుపతి గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత శృంగార వల్లభస్వామి దివ్య కల్యాణాన్ని మంగళవారం కన్నులపండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కంకణధారణ, అగ్నిప్రతిష్ఠాపన, యజమాని సంకల్పం, భక్త సంకల్పం, మహా సంకల్పం, మంగళ సూత్రధారణ ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. నక్షత్ర హారతి, మంగళ హారతితో క్రతువు ముగిసింది. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు, సిబ్బంది విస్తృత ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) కల్యాణోత్సవాన్ని తిలకించారు. కల్యాణాన్ని తిలకించిన భక్తులు పునీతులయ్యారు.



కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకస్వాములు

ఘనంగా కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటేశ్వర నగర్ న్యూపోర్టు రైల్వేస్టేషన్ ఎదురుగా గల అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దివ్య కల్యాణం వేద పండితుల మంత్రోచ్ఛారణలతో మంగళవారం ఘనంగా జరిగింది. వెంకటేశ్వర నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అర్చకుడు పుల్లేటికుర్తి సుబ్రహ్మణ్య శివాచార్య నిర్వహణలో శివపార్వతుల కల్యాణం, వివిధ రకాల పుష్పాలు, ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. మాజీ కార్పొరేటర్ చిట్నీడి నారాయణమూర్తి-సత్యవతి, సాయి ఈశ్వర సత్యనారాయణ-సూర్య వెంకటలక్ష్మి దంపతులు కర్తలుగా పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తమ గోత్ర నామాలతో పూజలు చేయించుకున్నారు. అనంతరం భక్తులకు భారీ అన్నసమారాధన చేశారు. టీడీపీ 13వ డివిజన్ ఇన్‌చార్జి గాది శివరామకృష్ణ, ఆలయ దాత వంశీయులు మల్లవరపు దీపక్, సత్యకుమారి, పారపు రమేష్, సూర్యప్రదీప్, హేమ పాల్గొన్నారు. ఆలయ మేనేజ్‌మెంట్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

టీడీపీ జిల్లా కార్యాలయంలో నేడు ప్రజా దర్బార్

కాకినాడ సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో బుధవారం ఉదయం 10 గంటలకు నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'ప్రజా దర్బార్' నిర్వహించనున్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, తుని ఎమ్మెల్యే యనమల దివ్య, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ విచ్చేయనున్నారు. టీడీపీ పిఠాపురం ఇన్‌చార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ, కాకినాడ రూరల్ కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, కో-కో-ఆర్డినేటర్ కటకంశెట్టి బాబీ ప్రజలు, నాయకులు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరిస్తారు.

పాలీసెట్ మెటీరియల్ పంపిణీ

పెద్దాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ), భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో యాసలపు సూర్యారావు భవన్‌లో పాలీసెట్ ఉచిత శిక్షణ ఇస్తున్నారు. మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి రాజేష్‌కుమార్ దేవత, దాతల సహకారంతో 60 మంది విద్యార్థులకు రూ.15వేలు విలువచేసే పాలీసెట్ మెటీరియల్ సమకూర్చారు. వీటిని అమెరికాలో నివసిస్తున్న పెద్దాపురం విద్యార్థి కొనగళ్ల నాగరఘు సహకారంతో ఆయన తండ్రి వెంకటరాజు పంపిణీ చేశారు. చిల్డ్రన్స్ క్లబ్ రాష్ట్ర కన్వీనర్ కోరెడ్ల రమాప్రభ, మండవిల్లి భాస్కరరావు, నరేష్ పెద్దిరెడ్డి, ఆరిఫ్ అలీ, కోరుకొండ ప్రశాంత్, వడ్డి సత్యనారాయణ, నవీన్, నాని, అమృత, నమ్రత, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం



ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న హెచ్ఎం సాయిరామకృష్ణ, ఉపాధ్యాయులు

'ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్చండి'

సామర్లకోట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రత్యేకంగా కల్పిస్తున్న సదుపాయాలను దృష్టిలో ఉంచుకుని పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరుతూ అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్ఎంలు తోటకూర సాయిరామకృష్ణ, యు.మీనామాధురి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటా ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఉపాధ్యాయులు వి.రాజు, కె.అరుణ, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.





గోర్సలో సచివాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు, వారితో మాట్లాడుతున్న దేవదాయ శాఖ అధికారి సుబ్బారావు

సీతారామస్వామి ఆలయ భూములను పరిరక్షించాలి

గోర్స గ్రామస్తుల డిమాండ్... పోలీసులతో ఆందోళనకారుల వాగ్వాదం... కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్న దేవదాయ శాఖ అధికారి

కొత్తపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోర్స గ్రామంలో అన్యాక్రాంతమైన సీతారామస్వామి ఆలయ భూములను పరిరక్షించాలని గ్రామస్తులు, మహిళలు భారీ ఎత్తున ఆందోళన చేపట్టి ధర్నా నిర్వహించారు. మంగళవారం ఉదయం ఆలయం నుంచి గ్రామస్తులు ర్యాలీగా సచివాలయానికి చేరుకున్నారు. ఆలయ భూముల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులపై చర్యలు చేపట్టాలని నినాదాలు చేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆందోళన కొనసాగింది. ఎండ తీవ్రతకు పితాని నాగేశ్వరరావు అనే వృద్ధుడు స్పృహ కోల్పోవడంతో ఆందోళనను ఉధృతం చేశారు. ఆలయ భూముల పరిరక్షణకు అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టారో తెలియజేయాలని సచివాలయంలో విధులకు హాజరైన వీఆర్వో, పంచాయతీ కార్యదర్శిని గ్రామస్తులు నిలదీశారు. సచివాలయం వద్ద ఆందోళన చేపట్టారన్న సమాచారంతో ఎస్ఐ వెంకటేష్ సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకున్నారు. పోలీసులకు ఇక్కడ పనేంటని ఆందోళనకారులు ఎస్ఐతో వాగ్వివాదానికి దిగారు. ఒకానొక సందర్భంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈలోగా తహసీల్దారు చిన్నారావు సూచన మేరకు డిప్యూటీ తహసీల్దారు మురళీకృష్ణ గోర్స చేరుకున్నారు. గ్రామస్తుల డిమాండ్లను కలెక్టర్‌కు నివేదిస్తామని, అప్పటివరకు గడువు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి వచ్చి ఆలయ భూముల పరిరక్షణపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేదిలేదని ఆందోళనకారులు భీష్మించారు. ఈ విషయాన్ని డిప్యూటీ తహసీల్దారు కాకినాడ జిల్లా దేవదాయ శాఖ అధికారి సుబ్బారావుకు ఫోనులో తెలిపారు. గోర్స చేరుకున్న ఆయన ఆలయ భూముల విషయాన్ని బుధవారం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు. సమస్యను ఇప్పుడే పరిష్కరించాలని ఆందోళనకారులు ముక్తకంఠంతో నినాదాలు చేశారు. దీంతో దేవదాయ శాఖ అధికారి పరిస్థితిని కలెక్టర్‌కు వివరించారు. ఆయన వెంటనే ముఖ్యమైన వ్యక్తులను కలెక్టరేట్‌కు తీసుకురావాలని దేవ దాయ శాఖ అధికారి సుబ్బారావును ఆదేశించారు. దీంతో గోర్స గ్రామానికి చెందిన ముఖ్యమైన వ్యక్తులు కాకినాడ కలెక్టరేట్‌కు బయల్దేర డంతో ఆందోళన విరమించారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు చేదులూరి గవరయ్య, గోర్స గ్రామ సర్పంచ్ రొంగల వీరబాబు, ఎంపీటీసీ కె.సూర్యనాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ పీవీ సన్నిబాబు, అయినంపూడి సూర్యనారాయణరాజు, గంధం సత్యనారాయణ ఆందోళనలో పాల్గొన్నారు.

'50 శాతం పింఛను నకారా చలవే'

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): డీఎస్ నకారా 112 జయంతి సందర్భంగా నగరంలోని పెన్షన్ కార్యాలయంలో పింఛనుదారులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ అధ్యక్షుడు పద్మనాభం మాట్లాడుతూ నకారా కృషి ఫలితంగానే ఈనాడు పింఛనుదారులంతా మూలవేతనంలో 50శాతం పింఛను పొందుతూ సంఘంలో గౌరవంగా జీవిస్తున్నారన్నారు. టి.నూకరాజు, వి.శేషగిరి, వెంకటరాజు, ఇబ్రహీం, భాస్కరరావు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



నకారా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పింఛనుదారులు

'స్వేచ్ఛ ఫర్ లిటిల్ బర్డ్స్' పోస్టర్ ఆవిష్కరణ

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కాకినాడ శాఖ, పడాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూపొందించిన 'స్వేచ్ఛ స్వేచ్ఛ ఫర్ లిటిల్ బర్డ్స్' పోస్టర్‌ను కలెక్టర్ షాన్‌మోహన్, రాష్ట్ర రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, పడాల చారిటబుల్ ట్రస్ట్ సీఈవో సూర్య ప్రసాద్ మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు చదువుతున్న విద్యార్థినులకు ప్రైవేట్ పార్ట్స్, సేఫ్ టచ్, అన్ సేఫ్ టచ్, సేఫ్టీ రూల్స్, బుల్లియింగ్, పోక్సో చట్టం, ఇంటర్నెట్ సేఫ్టీ వంటి అంశాలపై పర్సనల్ సేఫ్టీ ఎడ్యుకేషన్ మాడ్యూల్ ద్వారా అవగాహన కల్పిస్తామని చెప్పారు.

మెగా వైద్య శిబిరం

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ కాకినాడ సంకల్ప సభ్యులు ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్స్ సహకారంతో మంగళవారం తమ్మవరంలో ఏర్పాటుచేసిన మెగా వైద్య శిబిరాన్ని లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇవీవీ ఈశ్వర్‌కుమార్, పాస్ట్ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో నివసించే నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించి, వారి ఆరోగ్య సంరక్షణకు పాటుపడుతున్న లయన్స్ క్లబ్ సంకల్ప సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికవర్ హెడ్ సుభాకరరరావు, లయన్స్ క్లబ్ కో-ఆర్డినేటర్ ఎం.రాధా, రీజినల్ చైర్‌పర్సన్ పి.రాజేశ్వరి, జోన్ చైర్‌పర్సన్ సామా రాజేశ్వరి, ప్రాజెక్టు చైర్‌పర్సన్ శ్రీదేవి, క్లబ్ సెక్రటరీ సువర్చల, రత్నమాలతి, సహస్ర, గ్రామ పెద్ద గొల్లపల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

'పవన్ చిన్న కుమారుడు త్వరగా కోలుకోవాలి'

పిఠాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సింగపూర్‌లోని పాఠశాలలో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పెండెం దొరబాబు, వంగా గీతావిశ్వనాథ్ ఆకాంక్షించారు. ఈ మేరకు వారు వేర్వేరుగా సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు.

'ఆర్థిక సంఘం సిఫార్సుల అమలుకు పవన్ చొరవ చూపాలి'

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఐదో ఆర్థిక సంఘం సూచించిన సిఫార్సుల అమలుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవ తీసుకోవాలని మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాదరావు కోరారు. మంగళవారం రమణయ్యపేట ఏపీఐఐసీలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీల ఆదాయాన్ని బట్టి రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయం నుంచి ఎంత శాతం నిధులు కేటాయించాలన్నది 73వ రాజ్యాంగ సవరణలో పేర్కొన్నారన్నారు. ఈ ప్రకారం ప్రతి ఐదేళ్లకోసారి ఆర్థిక సంఘాలను ఏర్పాటుచేసి నిధులు కేటాయించాల్సి ఉందన్నారు. అయితే ఈ విధానం కార్యరూపం దాల్చట్లేదన్నారు. పల్లెల ప్రగతి కోసం రాష్ట్ర బడ్జెట్‌లో 25 శాతం నిధులు కేటాయించాలని సుప్రీంకోర్టు ఆదేశించినా అమలుకు నోచుకోలేదన్నారు. పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుని ఆర్థిక సంఘం సిఫార్సులు అమలు జరిగేలా చూడాలన్నారు.



పిఠాపురంలో వాహనాల డ్రైవర్లకు సూచనలిస్తున్న సీఐ శ్రీనివాస్

'నిబంధనలు పాటించకపోతే చర్యలు'

గొల్లప్రోలు/పిఠాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను తీసుకువెళ్లే వాహనాల డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ సూచించారు. గొల్లప్రోలు, పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్ల పరిధిలోని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల బస్సులు, వ్యాన్ల డ్రైవర్లు, విద్యార్థులను తీసుకెళ్లే వ్యాన్లు, ఆటోల డ్రైవర్లతో మంగళవారం ఆయన వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. విద్యార్థులతో వాహనాలు ఉన్న సమయంలో నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలు నడిపే సమయంలో సెల్ మాట్లాడవద్దని, ఆటోల్లో పరిమితికి మించి, డ్రైవర్ పక్కన, వెనుక వైపు విద్యార్థులను ఎక్కించుకోవద్దని సూచించారు. ఇవి పాటించకుంటే ఆటోలను సీజ్ చేస్తామన్నారు. గొల్లప్రోలు, పిఠాపురం టౌన్ ఎస్ఐలు ఎన్.రామకృష్ణ, మణికుమార్ పాల్గొన్నారు.



రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న మండల సప్లయి అధికారి కమలకుమారి

గొంచాలలో పీడీఎస్ బియ్యం గల్లంతుపై విచారణ

సామర్లకోట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొంచాల 74వ నంబరు రేషన్ దుకాణంలో 1,310 కిలోల పీడీఎస్ బియ్యం గల్లంతుపై అందిన ఫిర్యాదులతో తనిఖీలు నిర్వహించాలని డిప్యూటీ తహసీల్దారు, ఎంఎస్‌వో కమలకుమారిని జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి సత్యనారాయణరాజు ఆదేశించారు. దీంతో మంగళవారం ఆమె వీఆర్వోతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ-పోస్ రికార్డుల మేరకు బియ్యం 1,410 కిలోలు ఉండాల్సి ఉండగా 100 కిలోలు మాత్రమే ఉందని, మిగిలినది గల్లంతైనట్టు గుర్తించారు. డీలర్ పోలరపు వీరవెంకట సత్యనారాయణను డీటీ కమలకుమారి ప్రశ్నించినప్పటికీ సరైన వివరణ రాలేదు. దీంతో పీడీఎస్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించి అక్రమాలకు పాల్పడినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. సదరు డీలరుపై 6(ఎ) కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం డీఎస్‌వో సత్యనారాయణరాజుకు నివేదించనున్నట్టు ఎంఎస్‌వో కమలకుమారి చెప్పారు.

13న కామ్రేడ్ వాసుదేవరావు వర్ధంతి సభ

కాకినాడ సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పోరాట యోధుడు వాసుదేవరావు వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో ఈ నెల 13న న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కామ్రేడ్ పైలా వాసుదేవరావు 15వ వర్ధంతి సభ పోస్టర్, కరపత్రాలను మంగళవారం కచేరీపేటలోని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆర్.రాఘవులు, జి.రాజ్‌కుమార్, దుర్గారావు, నాగేశ్వరరావు, చంద్రరావు, తాతారావు, కృష్ణ, సతీష్, అడపా రాజు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు



శేష వాహనంపై విహరిస్తున్న స్వామి, అమ్మవారు

శేష వాహనంపై సీతారాములు

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలులో సీతారాముల గ్రామోత్సవం మంగళవారం రాత్రి శేష వాహనంపై వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్లను ప్రజలు దర్శించుకున్నారు.



స్వయంవర పార్వతి అమ్మవారికి శాంతి కల్యాణం

సామర్లకోట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వసంత నవరాత్ర మహోత్సవాల ముగింపు సందర్భంగా కంచి మహా సంస్థానంలో వ్యవస్థాపక కుటుంబీకులు చంద్రాభట్ల పతంజలి-పద్మ దంపతుల ఆధ్వర్యంలో పండితుడు చీమలకొండ గోపాలం వేద మంత్రోచ్ఛారణల మధ్య శాంతికర కల్యాణం జరిపారు. కంచి పట్టు చీరతో అమ్మవారిని సర్వాంగసుందరంగా అలంకరించి విశేష పూజలు చేశారు.

శివాజీ ఫ్లెక్సీ చింపివేతపై ఫిర్యాదు

పెద్దాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం-సామర్లకోట రహదారిలో ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం వద్ద ఛత్రపతి శివాజీ మహరాజ్ ఫ్లెక్సీని సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చింపివేశారు. దీనిపై బీజేపీ నాయకుడు డాక్టర్ గొరకపూడి చిన్నయ్యదొర ఆధ్వర్యంలో ఎస్‌డీపీవో డి.శ్రీహరిరాజుకు ఫిర్యాదు చేశారు. నాయకులు దుర్గా మోహనరావు, మోటూరి వీరబాబు, బొలిశెట్టి రామ్‌కుమార్, పుప్పాల నాగగోవిందు, పోతుల ప్రభాకరరావు, ఏడుకొండలు, ఛత్రపతి శంభాజీ యువసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

పిఠాపురం రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం జల్లూరులో వీధి రాంబాబు కుమార్తె నిస్సికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. చెక్కును పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ మంగళవారం అందజేశారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్ మృతదేహానికి పోస్టుమార్టం

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ శశికాంత్ నగర్‌కు చెందిన దాకరపు దుర్గవేణుగోపాల ప్రసాద్ మృతదేహానికి జీజీహెచ్‌లో మంగళవారం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించినట్టు సర్పవరం ఎస్ఐ ఏసుబాబు తెలిపారు. కుటుంబ కలహాలు, ఆరోగ్యం సరిగా లేక ఆదివారం ప్రసాద్ ఇంట్లో ఫ్యాన్ కొక్కేనికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన విదితమే. కన్న తల్లి వేధింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్టు ప్రసాద్ సెల్ఫీ వీడియో వైరల్ కావడం తెలిసిందే. మృతుడి భార్య పావ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

నేడు కోటనందూరులో ఎమ్మెల్యే ప్రజాదర్బార్

కోటనందూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కోటనందూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 10.30 గంటలకు తుని ఎమ్మెల్యే యనమల దివ్య ప్రజాదర్బార్ నిర్వహించనున్నారని ఎంపీడీవో వెంకటనారాయణ తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కరించడానికి నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మన్యంలో రిసార్ట్స్‌లో పర్యాటకుడి మృతి

● అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


మృతుడు రాజేష్ (ఫైల్)

రంపచోడవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం పెద గెద్దాడలోని ఓ ప్రైవేటు రిసార్ట్స్‌లో పల్నాడు జిల్లాకు చెందిన ఓ పర్యాటకుడు మృతి చెందాడు. అతడిని పల్నాడు జిల్లా గణపవరానికి చెందిన ఆకారపు రాజేష్ (36)గా గుర్తించారు. ఈ నెల 5న రిసార్ట్స్‌లో దిగిన ఆయన మర్నాడు కూడా బయటకు రాకపోవడంతో నిర్వాహకులకు అనుమానం వచ్చింది. క్యాబిన్‌లో కిటికీ తెరిచి చూడగా మృతి చెంది ఉన్న విషయాన్ని గుర్తించి రంపచోడవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరిశీలించగా మృతుడి ముఖానికి ప్లాస్టిక్ కవర్ బిగించి ఉండడంతో ఊపిరాడక మృతి చెందాడని ప్రాథమికంగా గుర్తించారు. మృతుడి మంచం పక్కనే ఓ గ్యాస్ సిలెండర్ మాదిరిగా ఉన్న ఓ యంత్రాన్ని కూడా పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం ప్రైవేటు ఉద్యోగిగా ఉన్న మృతుడే వ్యక్తిగత సమస్యల కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉండ వచ్చని భావిస్తున్నారు. మృతదేహానికి బంధువుల సమక్షంలో శవపంచనామా నిర్వహించి వారి అభిప్రాయాలను కూడా నమోదు చేసుకుని అనంతరం శవ పరీక్ష చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయగా సీఐ రవికుమార్ ఆధ్వర్యంలోదర్యాప్తు సాగిస్తున్నారు.

పశువుల నీటితొట్టెల నిర్మాణానికి భూమి పూజ

దేవీపట్నం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఇందుకూరు-1 ఏనుగులగూడెం ఆర్అండ్ఆర్ కాలనీలో పశువుల నీటితొట్టెల నిర్మాణానికి ఎంపీడీవో రత్నకుమారి, ప్రోగ్రాం అదనపు అధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో దేవీపట్నం సర్పంచ్ కుంజంరాజామణి మంగళవారం భూమి పూజ చేశారు. ఏవో ఆర్.ప్రశాంతి, మరిశెట్ల వెంకటేశ్వరరావు, మాగాపు బాబూరావు, హరిశ్చంద్రుడు, రాయుడు, రామన్నదొర, సుబ్బారావు, రాంబాబు పాల్గొన్నారు.

వట్టిగడ్డ రిజర్వాయర్ పనులు వేగవంతం చేయాలి

రాజవొమ్మంగి, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలరాజుపేటలో వట్టిగడ్డ రిజర్వాయర్ కాలువ పూడికతీత పనులను వేగవంతం చేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి కోరారు. అప్పలరాజుపేట నుంచి వట్టిగడ్డ వరకు సాగునీరు అందించే పంట కాలువలో రూ.10లక్షలతో పూడికతీత చేస్తున్నా మన్నారు.


కాలువ పూడిక తీత పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

హడలెత్తిస్తున్న బెంజ్ లారీలు

● మితిమీరిన వేగంతో ప్రయాణం

మారేడుమిల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా ఏజెన్సీ ఎగువ ప్రాంతానికి వస్తున్న బెంజ్ లారీలు మితిమీరిన వేగంగా ప్రయాణిస్తుండడంతో గిరిజనులు హడలెత్తిపోతున్నారు. మంగళవారం సున్నంపాడు గ్రామ సమీపంలో ఆగి ఉన్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన భారీ లారీని వెనుక నుంచి భారత్ బెంజ్ లారీ బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను సున్నంపాడు గ్రామస్థులు సుమారు గంటసేపు శ్రమించి బయటకు తీశారు. ఇటీవల వై.రామవరం ఎగువ ప్రాంతంలో గుర్తేడు నుంచి ఆకుమామిడికోట వరకు రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందుకు ఫోక్స్‌పేట నుంచి బెంజ్ లారీల్లో మెటీరియల్ సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో భారీ వాహనాలు ప్రమాదకరమైన మలుపుల వద్ద కూడా మితిమీరిన వేగంతో ప్రయాణించడంతో గిరిజన గ్రామాల ప్రజలు, వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు. మంగళవారం జరిగిన ఘటనే కాకుండా తరుచూ ఈ మార్గంలో ప్రమాదాలు జరుగుతున్నాయని గిరిజనులు సోషల్ మీడియా గ్రూపుల ద్వారా తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసు అధికారులు స్పందించి లారీ డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇవ్వాలని కోరుతున్నారు.


సున్నంపాడు వద్ద జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన బెంజ్‌లారీ

డొంకరాయిలో మారమ్మ వార్షికోత్సవాలు


గరగలను ఊరేగిస్తున్న దృశ్యం

మోతుగూడెం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం బొడ్డగండిలో మారమ్మ అమ్మ వారి 53వ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం 6గంటల నుంచి అమ్మవారికి పాలాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామవీధుల్లో గరగలను ఊరేగించారు. సాయంత్రం ఆరు గంటల నుంచి అమ్మవారి గరగల అలంకరణ, రాత్రి 8 గంటలకు అగ్ని గుండం మీదుగా గంగాలమ్మ ప్రవేశం, అనంతరం గరగల ప్రతిష్ఠ జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు కె.సు ందర్, ఎం.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మన్యం పర్యాటకం, పరిశ్రమలపై నేడు సదస్సు

రంపచోడవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్ మేరకు మన్యంలో పర్యాటక రంగం, పరిశ్రమల ఏర్పాటుపై బుధవారం రంపచోడవరం ఐటీడీఏలో సదస్సు నిర్వహిస్తున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఇతర ప్రజా ప్రతినిధులు, గిరిజన పెద్దలు, గిరిజన సంఘాల నాయకులు, మేధావుల అభిప్రాయాలను తీసుకుంటారు. ఆయా వర్గాల నుంచి వచ్చిన అభిప్రాయాలు, సూచనల మేరకు అల్లూరి జిల్లాలో చేపట్టబోయే పర్యాటకాభివృద్ధి కార్యక్రమాలు, పరిశ్రమల ఏర్పాటు అంశాలపై ప్రణాళికలను సిద్ధం చేస్తారు.

ఎస్సీ మాదిగలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న మాదిగలు

రంపచోడవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని ఎస్సీ మాదిగలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుచేయాలని కోరుతూ సంఘ నాయకుడు ముమ్మిడివరపు చిన సుబ్బారావు ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే శిరీషదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కోస్తా జిల్లాల ఇన్‌చార్జి ఎన్.చినబాబు, మోర్తా బుజ్జిబాబు, విష్ణుమూర్తి, ఏఎం వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

పండుగ వాతావరణం తీసుకురావడమే లక్ష్యం

● పల్లె పండుగలో ఎమ్మెల్యే నెహ్రూ


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో పండుగ వాతావరణం తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మంగళవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని గోకవరం మండలం కామరాజుపేట, కొత్తపల్లి, గోకవరం, తిరుమలయపాలెం, మల్లవరంలో నిర్వహించారు. అనంతరం రూ.1.65 కోట్లతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

గుర్రప్పాలెం గ్రామ పంచాయతీకి నూతన ట్రాక్టర్

రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కింద ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లను మంజూరు చేసింది. గుర్రప్పాలెం గ్రామ పంచాయతీకి మంజూరైన నూతన ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పాండ్రంగి రాంబాబు, పడాల బాలాజీ, పడాల రాంబాబు,పడాల దుర్గ, పడాల విష్ణుమూర్తి, గొనిపాటి రాజు, తాతపూడి సత్తిబాబు, పొండ్రు బాలనాగు, కట్టమూరి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు బహుమతిగా ధాన్యం కుచ్చు

గోకవరం తంటికొండ గ్రామానికి చెందిన గ్రామ టీడీపీ అధ్యక్షుడు, విద్యాకమిటీ చైర్మన్ నాగం వెంకటపతి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు తన పొలంలో పండిన ధాన్యం వెన్నులతో ప్రత్యేకంగా తయారు చేయించిన ధాన్యం కుచ్చు బహుమతిగా అందించారు. ఈ కుచ్చును ఇర్రిపాక ఏలేరునది తీరాన వేంచేసి ఉన్నశివకేశవుల ఆలయంలో పక్షులకు ఆహారంగా అందించేందుకు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేని వెంకటపతి కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్‌బాబు, మాజీ జడ్పీటీసీ పాలూరి బోసుబాబు, భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూల్ చైర్మన్ గల్లా రామచంద్రరావు, తంటి కొండ దేవస్థానం మాజీ చైర్మన్ బదిరెడ్డి బాబి, టీడీపీ యువనేత దాసరి సీతారామకృష్ణ, పెద్దాడ వెంకన్న దొర, పిల్ల అర్జున సారథి, తదితరులు పాల్గొన్నారు.


ధాన్యం కుచ్చును ఎమ్మెల్యేకు అందజేస్తున్న దృశ్యం

శంఖవరంలో స్వచ్ఛభారత్


శంఖవరంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న యువకులు

శంఖవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా శంఖవరంలో జైభీమ్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. వారంరోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో యువతకు రాజ్యాంగంపై అవగాహన, ఆటలు, ముగ్గుల పోటీలు, వైద్యశిబిరం నిర్వహిస్తామని యూత్ సభ్యులు తెలిపారు. గునపర్తి అపురూప్, ఎస్.నాగు, కొంగు రమేష్, బత్తిన తాతాజీ, బత్తిన శివరామ్, కె.అప్పారావు, జి.కొండలరావు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

ప్రత్తిపాడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కూలీలు ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, ఏపీవో జి.కుమార్‌స్వామిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని ఉపాధి కూలీలకు 4 నుంచి 11 వారాల వేతన బకాయిలు ఉన్నాయని, వాటిని తక్షణమే ఉపాధి కూలీలకు చెల్లించాలన్నారు. సీఐటీయూ నాయకుడు ఎన్.సతీష్ కుమార్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పండిత సదస్యం


కార్యక్రమంలో పాల్గొన్న పండితులు

అన్నవరం, మే 8 (ఆంధ్రజ్యోతి): సీతారాముల దివ్యకల్యాణోత్సవాలలో భాగంగా అన్నవరం దేవస్థానం క్షేత్రపాలకులైన రామాలయం మంగళవారం పండిత సదస్యం నిర్వహించారు. సాయంత్రం 4గంటలకు నవదంపతులైన సీతారాములను, పెండ్లిపెద్దలైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను ఆశీనులు గావించి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం పండితులు తమ పాండిత్యాన్ని ప్రదర్శించారు. అనంతరం పండితులకు వినినక్షత్ర, మదురఫలాలు, నగదు పారితోషికం అందించారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో మెరుగైన బోధన


పేరవరంలో చిన్నారుల వివరాలు సేకరిస్తున్న ఉపాధ్యాయులు

ఏలేశ్వరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరవరం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు నేతృత్వంలో గ్రామంలో మంగళవారం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. చిన్నారులను తమ పాఠశాలలో చేర్పించాలని ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఉన్నాయని, గుణాత్మక విద్య అందించి, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామని వివరించారు. ఈ సందర్భంగా 12 మంది విద్యార్థులను నమోదు చేశామన్నారు. ఉపాధ్యాయులు సుందరరావు, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

రౌతుపాలెంలో ఉపాధి పనులు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రౌతుపాలెం గ్రామంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టే పలు పనులకు సర్పంచ్ కొంగన బుల్లమ్మాయి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ పథకంలో చేపట్టే రహదారులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు వల్ల గ్రామంలో పలు సమస్యలు పరిష్కారమవుతాయని సర్పంచ్ అన్నారు. కార్యక్రమంలో ఏపీవో కుమార్ స్వామి, నిమ్మల రాంబాబు, కోలా ధనబాబు, గుండం సత్తిబాబు, చిరుబోలు ఏసు, కొంగన నాని, మంతెన రామాంజనేయులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో టీడీపీ నాయకుడు నిమ్మల రాంబాబు ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్డులు పంపిణీ చేశారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

కిర్లంపూడి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి వ్యక్తి మృతిచెందిన సంఘటనపై మంగళవారం కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మండలం సోమవారం గ్రామానికి చెందిన కొల్లటి సత్తిబాబు అనారోగ్య సమస్యల కారణంగా జీవితం మీద విరక్తి చెంది ఈనెల 7న గ్రామ శివారులోని అరటి తోటలో కలుపు మందు తాగాడు.

వెంటనే ప్రత్తిపాడు సీహెచ్‌సీ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ వైద్యం పొందుతూ మృతిచెందాడు.

దీనిపై సత్తిబాబు కుమార్తె లావణ్య కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రైటర్ వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్తిని కాజేసి బెదిరింపులు

అత్తింటి వద్ద మహిళ మౌన దీక్ష


పెళ్లి ఫొటోలు చూపిస్తున్న నాగవెంకటలక్ష్మి

కిర్లంపూడి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడికి చెందాల్సిన ఆస్తిని అత్తింటివారు, భర్త తరఫు బంధువులు కాజేయడమే కాకుండా స్థానిక వైసీపీ నేత అండతో తమను బెదిరిస్తున్నారని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అత్తింటి వద్ద కుమారుడు, బంధువులతో కలిసి ఓ మహిళ మౌన దీక్షకు దిగిన ఘటన కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రాజుపాలెంలో జరిగింది. కాజులూరు మండలం పెనుమళ్ల గ్రామానికి చెందిన నాగవెంకటలక్ష్మికి కొత్తపల్లి మండలం గొర్స గ్రామానికి చెందిన వీరబాబుకు 2001 పెద్దల సమక్షంలో వివాహమైంది. కొన్నేళ్ల తర్వాత వారు కిర్లంపూడి మండలం రాజుపాలెం వచ్చి స్థిరపడ్డారు. అయితే వీరబాబు మానసిక స్థితి సరిగ్గా లేదని తెలిసి కూడా అత్తింటివారు తనను మోసం చేసి పెళ్లి చేశారని నాగలక్ష్మి ఆరోపించింది. అయినప్పటికి సర్దుకుపోయి వీరబాబుతో కాపురం చేశానని, తనకు బాబు పుట్టిన తర్వాత తనను, కుమారుడిని పూర్తిగా దూరం పెట్టారని కనీసం ఇంట్లోకి కూడా రానివ్వడంలేదని వాపోయింది. భర్త ద్వారా తన కుమారుడికి చెందాల్సిన ఆస్తిని అత్తింటివారు వేరే వారికి కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇదేం టని ప్రశ్నిస్తే కనీసం ఇంట్లోకి కూడా రానివ్వడంలేదని బయటకు పొమ్మంటు న్నారని స్థానిక వైసీపీ నేత అండతో బెదిరిస్తున్నారని ఎక్కడికి వెళ్లిన న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేసింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి నారా లోకేశ్‌కు లేఖ రాస్తున్నామని, తనకు న్యాయం జరిగేవరకు తన కుమారుడు దత్తసాయితో కలిసి ఇక్కడే కూర్చుని ఉంటానని నాగలక్ష్మి పేర్కొంది.

'మధ్యాహ్న' భోజనం పరిశీలన


ఇర్రిపాకలో భోజనాన్ని వడ్డిస్తున్న జ్యోతుల మణి

జగ్గంపేట రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం ఇర్రిపాక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సతీమణి మణి మంగళవారం విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రోజు మెనూ ప్రకారం భోజనం ఉండాలని, పిల్లలకు తాజా ఆకుకూరలు, కూరగాయలతో భోజనాలు తయారు చేయాలని కోరారు. వంటపాత్రలు శుభ్రంగా ఉంచాలన్నారు. అనం తరం పిల్లలందరికీ భోజనం వడ్డించారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్, మాజీ వైస్ ఎంపీపీ బస్వా చినబాబు, టీడీపీ నేత జ్యోతుల సత్యమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం


భోజనాలు వడ్డిస్తున్న జనసేన నాయకులు

జగ్గంపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట టౌన్ పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రతి మంగళవారం జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారు. ఈ వారం కూడా పేదలకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాజనాల శ్రీను, మాదారపు వీరబాబు, సూరపురెడ్డి నరేష్, మండపేట కాటా రాజు, సత్తి సోమరాజు, సూరపురెడ్డి నరేష్, రేపూరి శ్రీను, పాలెం బాబి , తదితరులు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో వర్క్‌షాప్

గండేపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయం కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో అమెజాన్ వెబ్ సర్వీసులు క్లౌడ్ స్టోరేజ్‌పై ఐదురోజుల సమగ్ర వర్క్‌షాప్ ప్రారంభమైంది. డిప్యూటీ ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు పలు విలువైన సూచనలు, ప్రేరణాత్మక సందేశాలు అందజేశారు. డాక్టర్ వంశీకృష్ణ క్లౌడ్ కంప్యూటింగ్‌తో విద్యార్థులు తమ నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఆకాక్షించారు.

బాధితులకు అండగా ఉంటాం

శంఖవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో ఇటీవల ఇల్లు అగ్నిప్రమాదానికి గురైన ఈగల దేవుళ్ల కుటుంబాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు పర్వత సురేష్, మండలాధ్యక్షుడు బద్ది రామారావు, జనసేన నాయకుడు మేడిశెట్టి సూర్యకిరణ్(బాబీ), సింగిలిదేవ్ సత్తిరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా బియ్యం, దుస్తులు, నగదు అందించారు. నూతనంగా ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం నుంచి చేయూత అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్నా ఈశ్వరుడు, కీర్తి వెంకటసుభాష్, ఉల్లి వీరభద్రరావు, సర్లం గోవిందు, బద్ది రమణ, పాకల ప్రసాద్, కరణం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ

ప్రత్తిపాడు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక సంజీవయ్యనగర్ వద్ద నుంచి ప్రధాన రహదారిపై ఈ నంది సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా క్రైస్తవ నాయకులు ఊబా కృపావరం, సాల్మన్‌రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో క్రైస్తవులపై దాడులు అరికట్టాలని, పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని, ఆయన కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. క్రైస్తవ సంఘ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బైండోవర్ నమోదు

తొండంగి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పది మంది సారా నిందితులు, ఏడుగురు బెల్లం అమ్మకందార్లను మండల రెవెన్యూ అధికారి వద్ద బైండోవర్ చేసినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వై.పట్టాభిచౌదరి తెలిపారు. ఎన్ఫోర్స్‌మెంట్ టీం ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి ఒకరి నుంచి 20 లీటర్ల సారా, 600 లీటర్ల బెల్లపు ఊట, 940 కిలోల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నారన్నారు. మరో వ్యక్తి నుంచి 25 లీటర్ల సారా, 450 లీటర్ల ఊటతోపాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని రిమాండ్‌కు తరలించామన్నారు.

శిశుమందిర్‌కు ఫ్యాన్ల వితరణ

ఏలేశ్వరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): యర్రవరం సరస్వతీ శిశుమందిర్ పాఠశాలకు దాతలు ఫ్యాన్లు వితరణ చేశారు. మంగళవారం పిఠాపురానికి చెందిన పెమ్మరాజు సత్యరామచంద్రరావు తండ్రి నాగభూషణరావు జ్ఞాపకార్థం 6 ఫ్యానులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి జరికెపూడి శంకరరావు, ప్రబంధకారిణి తోట వీరమహేశ్వరరావు, గొల్లపూడి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు ఫర్నీచర్ పంపిణీ

రాజవొమ్మంగి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎలిమెంటరీ పాఠశాలలో హౌసింగ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆర్థిక సహాయంతో మండలంలోని 27పాఠశాలలకు బెంచీలు, కుర్చీలను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి-భాస్కర్ దంపతులు మంగళవారం పంపిణీ చేశారు. ఫర్నీచర్ బహూకరించిన సంస్థ యాజమాన్యాన్ని అభినందించారు.


పాఠశాలకు ఫర్నీచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

పంచాయతీ కార్యదర్శికి సత్కారం

దేవీపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ గండేపల్లి మండలం నాయకంపల్లి బదిలీ అయ్యారు. మంగళవారం ఆయన్ను దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి ఆధ్వర్యంలో సత్కరించారు. వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


పంచాయతీ కార్యదర్శిని సత్కరిస్తున్న దృశ్యం

ప్రయాణంలో చల్లచల్లగా..

● విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై భారీ వృక్షాలు

ఎటపాక, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వేసవిలో ఎండలు మండిపోతున్నాయి. అయితే విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై భారీ వృక్షాలు ఉండడంతో ఇటుగా ప్రయాణం చల్లచల్లగా సాగుతోంది. అల్లూరి జిల్లా ఎటపాక మండలంలో రాయనపేట నుంచి వెంకటరెడ్డిపేట వరకు రహదారి వెంబడి ఉన్న భారీ వృక్షాలు చల్లటి ఆహ్లాదకర వాతావరణంను కల్గిస్తున్నాయి. ఏపీ ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు ప్రయాణించే వాహనదారులు సైతం ఈ చెట్ల కింద సేదతీరుతున్నారు. పర్యాటకులు ఎండ, వేడిమి నుంచి చెట్ల కింద ఉపశమనం పొందుతున్నారు.


జాతీయ రహదారిపై వెంబడి వాహనదారులకు నీడనిస్తున్న భారీ వృక్షాలు